# వియ్యం తీర్చిన కయ్యం

జి. రామకృష్ణ

గురుమూర్తి అంత తీవ్రంగా మాట్లాడక పోతే పద్మనాభానికి యింత యిదిగా కోపం వచ్చేదే కాదు. అవును. గురుమూర్తి మాత్రం పట్టుదలకోసం గట్టిగా వాదించ వలసివచ్చింది. తీరా పోట్లాటవరకు వచ్చాక వెనక్కి తగ్గటం చిన్నతన మని పించి మరికొంచెం వుద్రేకంలో మాట్లాడాడు గురుమూర్తి.

పద్మనాభం తన యింటికి దక్షిణ వేపున వున్న తీగ తీసివేసి గోడ కట్టించేందుకు సరిగ్గా కొలతలు తీయిస్తున్నాడు. పద్మనాభం ఖాయపరచిన హద్దు తన స్థలంలోకి వచ్చిందంటాడు గురుమూర్తి. చిలికి చిలికి గాలివానగా మారిందన్నట్టు ఈ పేచీ పెద్ద దయింది. చివరకు గోడకట్టడం ప్రారంభిం చేందుకు వీలులేకపోయింది.

ఈవివాదానికి పూర్వం యిద్దరూ మాంచి దోస్తీగా వుంటుండేవారు. 'బావగారూ' అంటే 'బావగారూ!' అని పిలుచుకుం టుండేవారు. ఆడంగులు కూడా 'ఒదినా' 'ఒదినా' అనుకునేవారు. ఈ గొడవ జరిగిన తర్వాత ఆ యింటికీ, యీ ఇంటికీ మాటలు సన్నగిల్లాయి.

పద్మనాభం యీ విషయంలో ప్లీడరు సలహా తీసుకుని ముందు వ్యవహారం జర పటం మంచిదనుకున్నాడు. బొను కెళ్ళి తన పాత ప్లీడరుతో సంప్రదించాలని నిశ్చ యించుకున్నాడు. అంతే కాకుండా బొనులో తనకొడుకు రామేశం బి. యె. రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొడుకునిచూసి చాలా రోజు లయ్యింది. ఒకమారు చూడా లనిపిస్తోందికూడా, రెండూ కలిపి వస్తాయని పద్మనాభం బొను బయలుదేరి వెళ్లాడు.

రామేశం యిదివరకు కాలేజీ హాస్టల్లో వుండేవాడు. కాని అక్కడ అతనికి తగిన సదుపాయంగా లేదు. అందువల్ల వేరే గది తీసుకుని హోటల్లో భోజనం ఏర్పాటు చేసుకున్నాడు. రామేశం యీ గదిలోకి వచ్చింతర్వాత పద్మనాభం రావటం యిదే మొదటిసారి.

తండ్రి తలవనితలంపుగా వచ్చినందుకు రామేశం చాలా సంతోషించాడు. రామేశం ఒకడే సంతానం అవటంవల్ల తల్లి తండ్రు లతన్ని గారాబంగా చూస్తారు. స్నానం భోజనం అయ్యాక కచ్చాపాటీ లోకి దిగారు. ఆ యిల్లుగలాయన గురు మూర్తికి తోడల్లుడని, ఆయనపేరు డాక్టరు శంకరం అని చెప్పాడు రామేశం. పద్మనాభం మనస్సెందుకో చివుక్కుమంది. తనొచ్చిన పని గురించి రామేశాని కింకా చెప్పలేదు. ఇంతలోనే బయటనుంచి శంకరం రామేశాన్ని వుద్దేశించి 'ఏమోయ్! రామేశం, ఎవరో బంధువు లొచ్చారల్లే వుందే' అంటూ గదిలోకి వచ్చాడు. ఒకరి కొకరికి పరిచయాలయ్యాయి. శంకరం మహా కలుపుగోలు మనిషి. ఈ యిల్లు క్రొత్తగా కొన్నాడు. ప్రాక్టీసు బాగానే వున్నది. ఇద్దరాడ పిల్లలూ, ముగ్గురు మొగపిల్లలూ సంతానం. పెద్దమ్మాయి సరోజిని యీ యేడు స్కూలు ఫైనలు పరీక్షకు వెళ్తోంది. రామేశం టేబుల్ లైటు 'ఆన్' చేసి చదువు ప్రారంభించాక పెద్దవాళ్ళిద్దరూ యివతల కొచ్చి వసారాలో కూర్చున్నారు కబుర్లకి.

చాలా విషయాలు చర్చించారు. శంకరం రామేశాన్ని బాగా పొగిడాడు. రామేశం కలివిడితనం, అలవాట్లు శంకరానికి బాగా నచ్చాయి. మరో విషయం కూడా శంకరం మనస్సుకు తెలుసు - రామేశం అన్నివిధాలా సరోజినికి నచ్చాడని, సరోజినంటే రామేశానికి నిండు ప్రేమ అని.

గురుమూర్తివిషయం వచ్చినప్పుడు పద్మనాభం నిండుకుండలా వ్యవహరించాడు. పోట్లాటగురించి ఏమాత్రం బయటపడనివ్వ లేదు. గురుమూర్తికి సంతానంలేని కారణం చేత సరోజినిని తమవద్ద వుంచుకుంటామని లోగడ గురుమూర్తి దంపతులు శంకరాన్ని చాలాసార్లు అడిగారు. స్కూలుఫైనలు పూర్తయ్యాక పంపుతామని వాగ్దానంచేసిన సంగతి కూడా చెప్పాడు శంకరం.

ఇంతలో సరోజిని వసారాలోకి వచ్చింది. పదిహేను సంవత్సరాల పసిడి బొమ్మ సరోజిని. చక్కటి రూపం. కొత్త మనిషి వుండటంవల్ల తిరిగి లోపలికి పోబో యింది. శంకరం ఆమెను వెనక్కి పిలిచి 'పరవాలేదు రామ్మా. మన రామేశం నాన్న గారే. మరెవరూ కాదులే' అన్నాడు. పద్మనాభం కూడ ఆమెను దగ్గరకు పిల్చాడు. ఆమె అందచందాలు చూసి మురిసిపోయాడు. తన కోడలుగా వుండాలని కలలుగన్నరూపం సరోజినిలో చూశాడు. ఆ క్షణంలో ఎన్నెన్నో భావసౌధాలు కట్టాడు. గురు మూర్తిమీద వున్న కోపం ఎందువల్లో మర్చి పోయాడు. 'ఏం చదువుతున్నావమ్మా!' అని సరోజినిని పల్కరించాడు. 'స్కూలు ఫైనలు చదువుతున్నానండీ' అంది వినయంగా. సరోజిని తిరిగి యింట్లోకి వెళ్ళి పోయింది. పద్మనాభం ఆమె వెళ్ళినవైపే చూస్తున్నాడు. తిరిగి ఊహాపథంలోకి వెళ్ళాడు. తన కొడుకు రామేశానికి ఇర వయ్యో సంవత్సరం రాబోతోంది మరో పది రోజుల్లో. త్వరలో ఒక యింటివాడిని చేసి ముద్దుముచ్చట్లుచూడాలని తల్లి అప్పుడేచాలా సార్లు గుర్తుచేసింది. రామేశానికి నచ్చిన పిల్లని వాడికి చెయ్యాలి. అయితే వాడి అభి రుచు లెలా వుంటాయో? సరోజినివంటి లక్ష్మీస్వరూపం గల కోడలు తన నట్టింట తిరుగుతుందా? అయితే తను జీవితంలో అభిలషించేది యింకేమీ వుండదు. ఇలా వూహిస్తూ అప్రయత్నంగా 'సరోజిని ఏ అదృష్టవంతుల యింటి కోడలవుతుందో గదా!' అన్నాడు శంకరంతో. ఆక్షణంలో శంకరంకూడ ఆశాసౌధాలు కట్టున్నాడు. రామేశం తనకన్నివిధాలా నచ్చిన యువ కుడు. ఏదో వెనకాల యింత వున్నవాడు. చదువు సంధ్యలు చక్కగా అబ్బాయి. ఇంకా పైకి చదవటానికి తగిన వుపాధి వున్న వాడు. పద్మనాభం అన్నమాటకు పరధ్యా నంగా 'ఆ అదృష్టవంతులు మీరే కాకూ డదా?' అన్నాడు. పద్మనాభం సంతోషంలో తగిన ప్రత్యుత్తరం యివ్వలేక నవ్వి వూరుకున్నాడు.

మరి కాసేపు మాట్లాడుకుని లోపలికి వెళ్లిపోయారు.

మర్నాడు పద్మనాభం శంకరం యింట్లో అతిథిమర్యాదలు పొందాడు.

ప్రస్తుతానికి గురుమూర్తిమీద ఎట్టి వ్యవ హారం జరపటానికి పద్మనాభానికి మనస్క రించలేదు. ఒకరోజు కొడుకుదగ్గర వుండి తిరిగి యింటికి బయలుదేరాడు. పద్మనాభం వెళ్తున్నానని చెప్పటానికి రాగా శంకరం 'త్వరలో మీ యింటిదగ్గరే మిమ్మల్ని కలుసుకుంటా' మన్నాడు.

రామేశం పట్టుదలతో చదువుతున్నాడు. అసలు తెలివితేటలున్నవాడు. సరోజిని కూడ బాగా చదువుతోంది, మంచి మార్కులు సంపాదించాలని. పరీక్షలు సక్రమంగా పూర్తయ్యాయి. రామేశం అన్ని పేపర్లు చాలా బాగా వ్రాశాడు. గ్రూపులో ఫస్టు క్లాసు వస్తుందనే ధైర్యం పొందాడు. సరోజినికూడ నిస్సందేహంగా పాసవుతానని నమ్ముతోంది.

రామేశానికి పరీక్షలవటంతో టౌనులో కాలేజీచదువు పూర్తయినట్టే. స్వగ్రామం వెళ్ళిపోయేందుకు నిర్ణయించుకున్నాడు.

సరోజినిని వదలి వెళ్ళిపోతున్నందుకు మొదట్లో చాలా విచారించాడు రామేశం. కాని తానుకూడ తన పెత్తండ్రి గురుమూర్తి యింటికి రానున్న సంగతి సరోజిని చెప్పాక రామేశం అమితానందం పొందాడు. అందరి దగ్గర సెలవు తీసుకుని రామేశం స్వగ్రామం చేరుకున్నాడు.

రామేశానికి, తనతండ్రికి గురుమూర్తికి జరిగిన పోట్లాటగురించి ఏమీ తెలియదు. అందువల్ల మామూలుగా గురుమూర్తిని 'మామయ్యా' అంటూ తరచు పలకరిస్తూనే వుంటున్నాడు. గురుమూర్తికూడ కలుపుగోలుమనిషి; నెమ్మదయినవాడు. రామేశం వచ్చాక పద్మనాభంమీద వుండే కోపం దాదాపు సాంతం తగ్గిపోయింది.

ఒకమారు మాటలవరుసలో రామేశం తాను టౌనులో వున్నప్పటి విశేషాలు చెప్తూ శంకరం ప్రసక్తి తెచ్చాడు. ఈ వార్త విని గురుమూర్తి బ్రహ్మానందం పొందాడు. తన ప్రయత్నాలకి అప్పుడే జయం కలిగినట్టు భావించాడు.

మరో వారంరోజులకు శంకరం, భార్యాపిల్లలతోసహా గురుమూర్తి యింటికి వచ్చాడు. వాళ్ళువచ్చాక పద్మనాభం, గురుమూర్తి యిళ్ళమధ్య రాకపోకలు తిరిగి సాగాయి. సరోజిని తరచువచ్చి పద్మనాభం భార్యతో కబుర్లు చెప్తూ ఉంటుంది. సరోజినితో మాట్లాడటమంటే పద్మనాభం భార్యకు మహాసంతోషం.

మంచితిథి చూచి వుదయానే గురుమూర్తి, భార్య, శంకరం, భార్య పద్మనాభం యింటికి వచ్చారు. ఆ మాటా యీ మాటా అయ్యాక గురుమూర్తి అన్నాడు: "పద్మనాభం బావా! చల్లకొచ్చి ముంతదాయటమెందుకు, అంతా తెలిసినవాడివి. వేరే చెప్పనవసరంలేదు. నావల్ల లోగడ తప్పు జరిగితే అది మనస్సులో పెట్టుకోవద్దు. నేను మా మరదలుకూతురు సరోజిన్ని పెంచుకోవాలని, అచ్చటా ముచ్చటా తీర్చుకోవాలని అనుకుంటున్నా. మీ చెల్లెలేమో 'మొగపిల్లవాడెని వద్దు ఆడపిల్లనే పెంచుకుందాం' అని పట్టుపట్టింది. సరే అన్నా. పిల్లకు ఈడు వచ్చినదన్న సంగతి నీకు తెలుసు. మన రామేశంకూడ మాకు కొత్తవాడుకాదు. మా ఎదుట పుట్టి పెరిగినవాడు. మా పిల్లని నీ యింటి కోడలుగా చేసుకున్నావంటే బ్రతికున్నంతకాలం మేమిద్దరం సరోజిన్ని రామేశాన్ని చూస్తూ ఆనందించే భాగ్యం కలుగుతుంది.'

పద్మనాభం హృదయంలోనించి చిరునవ్వు నవ్వాడు. 'బావా! నేనిదివరకే ఈమాట అనుకున్నా. అయినా మగపెళ్ళివారం, మహబెట్టుగా వుండాలి. మరో సంగతి...అసలు వాళ్ళిద్దర్ని అడగటం ధర్మం' అంటూ 'రామేశం! ఒరేనాన్నా!' అని కొడుకుని పిల్చాడు. రామేశం రాగానే 'ఏరా! శంకరంగారి అమ్మాయిని నీకిస్తామంటున్నారు, ఏమంటావ్?' అని అడిగాడు. సమాధానంగా చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు. ఇంతలో గురుమూర్తిభార్య సరోజనిని అక్కడకు తీసుకువచ్చింది. సరోజని ముఖంలో మందహాసం నృత్యం చేస్తోంది. గురుమూర్తి భార్య "ఏమండోయ్ అన్నయ్యగారూ! మా పిల్లకూడా నవ్వి సమాధానం యిస్తోంది చూడండి" అంది. అందరూ ఫక్కున నవ్వుకున్నారు.

ఆచారప్రకారం తాంబూలాలు పుచ్చుకున్నారు.

మాఘమాసంలో శుభలగ్నాన వివాహం జరిగింది.

రామేశం బి. యె. ప్యాసయ్యాక డాక్టరు కోర్సు చదివి పట్టా పొందాడు. స్వగ్రామంలోనే డిస్పెన్సరీ ప్రారంభించాడు.

గురుమూర్తి పెద్దవాడై పోయాడు. పద్మనాభం కూడా అదేవయస్సువాడు. సరోజిని రామేశం వాళ్ళ ఎదుటే వుంటున్నారు. అనే వారు కాంక్షించింది. గురుమూర్తిది, పద్మనాభంది యిప్పుడు ఒకే కుటుంబం. వాళ్ళ యిళ్ళ మధ్య పూర్వంవున్న తీగకూడా లేదు. రెండూ కలిసి ఒకే యిలుగా అయ్యాయి. రామేశానికి యిప్పుడు ఇద్దరు మగపిల్లలు. గురుమూర్తి అప్పుడప్పుడు అంటూవుంటాడు వియ్యంకుడితో: 'ఏం, బావా తురతురా పరుగెత్తావే, ప్లీడరు దగ్గరికి గోడకట్టాలని పట్టుపట్టి...యిప్పు డేమంటావ్...చూడు మనవలు ఆడుకోటానికి ఎంత జాగా వుంది. గోడవుంటే పడగొట్టాలిసివచ్చేది."

పద్మనాభం సమాధానంగా – "ఆ... అందుకు పోయానా బావా! మా కోడల్ని, కొడుకుని చూడటానికి వెళ్లానుగాని. కావాలంటే ఆ ప్లీడర్నడుగు. ఆయన్ని యీ సంగతి సంప్రదించానేమో ... అంతదాకా ఎందుకు మా రామేశాన్ని అడుగు మన తగాయిదాగురించి వాడికేమైనా చెప్పానేమోనని...సరోజిన్ని చూశాక చల్లకని తీసుకుపోయిన ముంతని దాచేశానంటే నమ్ము బావా!" అని అంటూవుంటాడు. ★


